
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.3 । కనిష్ఠం 27.2



ఆదిలాబాద్

జిల్లా వార్తలు

5

శుక్రవారం 5 జూలై 2024

### అంతర్జాతీయ పోటీలకు జిల్లా విద్యార్థుల ఎంపిక

ఆదిలాబాద్ రూరల్, జూలై4: జిల్లాలోని ప్రభుత్వ సైన్స్, ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల చెందిన ముగ్గురు విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి టార్గెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. గురువారం కళాశాలలో విద్యార్థులను ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్, అనిత సిబ్బంది పుష్పగుచ్ఛంతో అభినందించారు. నేపాల్ రాష్ట్రంలో ఈనెల 9నుంచి జరిగే పోటీలకు వంశీ, గౌరి, సాత్విక ఎంపికైనట్లు తెలిపారు. పోటీలో కప్ గెలుచుకొని రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



• రిమ్స్ ఆసుపత్రి ఆవరణలో నేలమట్టమై కనిపిస్తున్న ఇంకుడు గుంత

- జిల్లాలో అధ్వానంగా మారిన ఇంకుడు గుంతల నిర్మాణం
- నేలమట్టం కావడంతో వృథాగాపోతున్న వర్షపు నీరు
- ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహణ లేక నిరుపయోగం
- నీటిబొట్టుపై క్షేత్రస్థాయిలో కనిపించని అవగాహన



• జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో చెత్తా చెదారంతో నిండి ఉన్న ఇంకుడు గుంత



• జడ్పీ కార్యాలయ ఆవరణలో పిచ్చిమొక్కలతో కనిపించకుండానే పోయిన ఇంకుడు గుంత



# ఇంకుడు గుంతలపై ఇంత నిర్లక్ష్యమా?

ఆదిలాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నీటిబొట్టును ఒడిసి పట్టేందుకు నిర్మించిన ఇంకుడు గుంతలపై నిండు నిర్లక్ష్యమే కన్పిస్తోంది. వర్షాకాల సీజన్ ప్రారంభమైన ఇంకుడు గుంతల నిర్మాణంపై అధికారులు ప్రత్యేక దృష్టిని సారించినట్లు కనిపించడం లేదు. ఇప్పటికే నిర్మించిన ఇంకుడు గుంతలు వృధాగా మారి కనిపిస్తున్నాయి. ఏటా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కోట్ల నిధులను ఖర్చు చేస్తున్న ఆశించిన స్థాయిలో ప్రయోజనం కనిపించడంలేదు. 2023-24లో జిల్లావ్యాప్తంగా 2100 ఇంకుడు గుంతలను నిర్మించేందుకు డీఆర్డీఏ అధికారులు లక్ష్యం పెట్టుకున్న కేవలం 42ఇంకుడు గుంతల నిర్మాణాలు మాత్రమే పూర్తి చేశారు. దీన్ని బట్టి చూస్తుంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో తెలుస్తూనే ఉంది. రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం నమోదయ్యే జిల్లాలో నీటివనరులు అంతంత మాత్రంగానే అందుబాటులో ఉన్నాయి. ప్రతీఏటా వేసవికి ముందే భూగర్భజలాలు అడుగంటుకపోవడంతో తీవ్రమైన నీటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ ఏడాది జూన్ మాసం గడిచి పోయిన భూగర్భజలాలు ఇంకా పాతాలంలోనే కనిపిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో అయితే ఇప్పటికీ తాగేందుకు గుక్కెడు మంచి నీరు దొరకని పరిస్థితులున్నాయి. ప్రతీసారి సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నా నీటి బొట్టును ఒడిసి పట్టకపోవడంతో ఇలాంటి పరిస్థితికి దారితీస్తుందన్న వాదనలు లేకపోలేదు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాల్టా చట్టాన్ని తీసుకొచ్చిన అమలు చేయడంలో అధికారులు విఫలమవుతూనే ఉన్నారు. అవసరాలకు అనుగుణంగా వర్షపు నీటిని ఒడిసి పట్టకపోవడంతో భూగర్భజలాలు ప్రమాదకర స్థాయికి చేరుకుంటున్నాయి. 'ఇంటింటికీ ఇంకుడు గుంత' అనే నినాదంతో అధికారులు ప్రచార ఆర్భాటం చేస్తున్న ఆచరణ సాధ్యం మాత్రం కావడం లేదు. ఇంకుడు గుంతలపై క్షేత్ర స్థాయిలో సరైన అవగాహన లేక పోవడంతో అడుగడుగున నిర్లక్ష్యమే కన్పిస్తోంది.

#### వర్షపు నీరు గోదారిపాలు..

గత ప్రభుత్వ హయాంలో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాల్లో తప్పనిసరిగా ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశాలు జారీచేశారు. దీంతో అక్కడక్కడ ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతలను నిర్మించిన నిర్లక్ష్యంగా వదిలేయడంతో ఆనవాళ్లు కనిపించకుండా పోయాయి. ప్రస్తుతం పిచ్చిమొక్కలు, చెత్తచెదారంతో నిండిపోయి కనిపిస్తున్నాయి. యేళ్ల తరబడి నిర్వాహణ లేక పూడిక చేరి నేలమట్టం కావడంతో వర్షపు నీరు దిగువకు వృథాగా పోతోంది. జిల్లాలో ఏటా అధిక వర్షపాతమే కురుస్తున్నా ఆశించినస్థాయిలో భూగర్భ జలాలు కనిపించడం లేదు. జిల్లాలో నేల ఉపరితలం ఎత్తుపల్లాలుగా ఉండడంతో వర్షం కురిసిన వెంటనే దిగువకు వెళ్లిపోతోంది. వర్షపు నీటికి అడ్డుకట్ట వేయకపోవడంతో ఏటా వేల క్యూసెక్కుల వరద నీరు గోదావరి పాలవుతోంది. చెరువులు, కుంటల ద్వారా కొంతమేరకు భూగర్భ జలాలు పైపైకి వస్తున్న వేసవికి ముందే నీటి జాడలు కనిపించకుండా పోతున్నాయి. వరద నీటికి అడ్డుకట్టలు వేస్తే భూగర్భజలాలు గణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ దిశగా అధికారులు అడుగులు వేసినట్లు కనిపించడం లేదు. వర్షపు నీటిని ఒడిసి పడితే భావితరాల అవసరాలకు డోకా లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

#### అధికారులకు చిత్తశుద్ధి కరువు

వర్షపు నీటిని ఒడిసి పట్టడంలో జిల్లా అధికారులకే చిత్తశుద్ధి లేకుండా పోయింది. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలను ఏర్పాటుచేసి వర్షపు నీటిని ఒడిసి పట్టాల్సి ఉంటుంది. ఇప్పటికీ మెజార్టీ శాఖల కార్యాలయాల్లో ఇంకుడు గుంతలు కనిపించడమే లేదు. అక్కడక్కడ ఉన్న వాటి నిర్వాహణ గాలికొదిలేయడంతో కనిపించకుండానే పోతున్నాయి. దీంతో వర్షపు నీరు భూగర్భంలోకి ఇంకేందుకు అవకాశమే లేకుండా పోయింది. ఏదో నిర్మించామా, వదిలేశామా అన్నట్లుగానే అధికారుల తీరు మారింది. ఇంకుడు గుంతల్లోకి వర్షపు నీటిని మళ్లించకపోవ డంతో నిరుపయోగంగానే మరి కనిపిస్తున్నాయి. జిల్లా కలెక్టర్ కార్యాలయంతోపాటు జడ్పీ కార్యాలయం, ము న్సిపల్, డీఆర్డీఏ, డీపీఓ, డీఎంఅండ్‌హెచ్ఓ, రిమ్స్ ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, గాంధీపార్కు తదితర కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలు పిచ్చిమొక్కల మధ్య చెత్తాచెదారంతో అధ్వానంగా మారి దర్శనమిస్తున్నాయి. వర్షాకాలం ప్రారంభమై నెలరోజులు గడిచిపోతున్నా ఇంకు డు గుంతల వైపు అధికారులు కన్నెత్తి చూడక పోవడంతో వర్షపు నీరు వృధాగానే మారుతోంది.

#### నిండు నిర్లక్ష్యం..

జిల్లాలో పల్లె ప్రగతి కార్యక్రమాలను చేపట్టిన అధికారులు ఇంకుడు గుంతల జోలికి వెళ్లినట్లు కనిపించడం లేదు. అధికారుల నిండు నిర్లక్ష్యంతో ఇంకుడు గుంతలు కనిపించకుండానే పోతున్నాయి. ఇంటి అనుమతులు ఇచ్చే సమయంలో విధిగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ప్రజల్లో అవగాహన కల్పించాల్సి ఉంది. కానీ స్థలం ఇబ్బం దుల తో పాటు అధికారులు కఠినంగా వ్యవహరించక పోవడంతో నూతనంగా నిర్మించే ఇంటి నిర్మాణాల్లో ఇంకుడు గుంతల జాడ కనిపించడం లేదు. అపార్ట్‌మెంట్ భవన నిర్మాణ సముదాయాల్లోను ఇంకుడు గుంతల నిర్మాణానికి యజమానులు ముందుకు రావడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో కొంత మేరకు ఇంకుడు గుంతలను నిర్మించుకుంటున్న సకాలంలో బిల్లులు చేతికి రావడం లేదని వాపోతున్నారు. పట్టణ ప్రాంతంలోను ఇంకుడు గుంతల ప్రాధాన్యత లేక పోవడంతో చిన్నపాటి వర్షాలకే మురికి నీటి కాలువలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. యేటా డీఆర్డీఏ అధికారులు లక్ష్యాన్ని నిర్ణయిస్తున్న ఆచరణలో మాత్రం నిండు నిర్లక్ష్యమే కన్పిస్తోంది.



#### అవసరమైన చోటే నిర్మిస్తున్నాం..

• సాయన్న (డీఆర్డీఏ పీడీ, ఆదిలాబాద్)

గతంలో మాదిరిగా కాకుండా అవసరమైన చోటనే నీటి గుంతలను నిర్మిస్తున్నాం. ప్రస్తుతం నాలుగైదు మండలాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. వర్షపు నీరు నిలిచే ప్రాంతాలలో ఇంకుడు గుంతలను నిర్మిస్తే ప్రయోజనం ఎక్కువగా ఉంటుంది. దీంతో మురికి గుంతలు లేకుండా నివారించే అవకాశం ఉంటుంది. అలాగే భూగర్భ జలాలు సంవృద్ధిగా పెంపొందించుకోవచ్చు. దీనిపై ప్రజల్లో మరింత అవగాహన కల్పిస్తాం.

## సంక్షిప్త సమాచారం



ఐటీడీఏపికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

### 'బోరు బావులకు విద్యుత్ కనెక్షన్ ఇప్పించండి'

బోథ్, జూలై4: మండలంలోని పాట్నాపూర్ గ్రామానికి చెందిన దాదాపు 27మంది రైతులు తమ చేలలో పంటలకు సాగునీరు అందించేందుకు కొత్తగా తవ్వించిన బోరు బావులను విద్యుత్ సౌకర్యం కోసం విద్యుత్ లైన్ వేయించాలని, ఇందుకు ఐటీడీఏ సహకారం అందించాలని కోరారు. గురువారం గ్రామానికి చెందిన 27మంది రైతులు వినతిపత్రం అందించారు. స్పందించిన పీవో అవసరమైన ఎస్టిమేషన్ వేయించుకుని రావాలని ఈ విషయమై విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతామని చెప్పినట్లు రైతులు పేర్కొన్నారు.

### ఐటీఐ ప్రవేశాలకు 15వరకు గడువు

ఉట్నూర్ జూలై4: మండల కేంద్రంలోని గిరిజన పారిశ్రామిక శిక్షణ సంస్థలో 15వరకు ప్రవేశాలకు గడువు ప్రభుత్వం కల్పించిందని ఐటీఐ ప్రిన్సిపాల్ రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సర్టిఫికెట్లు స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

### ఘనంగా మాజీ సీఎం జయంతి

ఆదిలాబాద్ అర్బన్, జూలై 4: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత కొనిజేటి రోశయ్య జయంతి వేడుకలను జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా శాసనమండలి సభ్యుడిగా, ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌గా ఆయన అందించిన సేవలను సంఘం ప్రతినిధులు స్మరించుకున్నారు. కార్యక్రమంలో జనగం సంతోష్, కౌటిక్‌రాజు, మధుకర్, రాజేశ్, దిన్కర్‌మోహన్ పాల్గొన్నారు.

### ట్రిపుల్ ఐటీకి ఎనిమిది మంది విద్యార్థుల ఎంపిక

బోథ్, జూలై 4: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల నుంచి ఎనిమిది మంది విద్యార్థులు బాసర ట్రిబుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక పాఠశాల నుంచి ట్రిబుల్ ఐటీకి ఎంపిక కావడం సంతోషంగా ఉందని పేరన్కొన్నారు. ఈ సందర్భంగా ట్రిబుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

### ముగ్గురు దొంగల అరెస్ట్

ఆదిలాబాద్ రూరల్, జూలై 4: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ జిన్నింగ్ మిల్లులో పల్లీ బస్తా చోరీ కేసును టూటౌన్ పోలీసులు ఛేదించారు. గత నెల శ్రీనాథ్ జిన్నింగ్‌లో పది క్వింటాళ్ల పల్లీలు, రెండు మోటార్లు, వైర్లను నలుగురు దొంగలు ఎత్తుకెళ్లారు. అయితే ఈ కేసును దర్యాప్తు చేసిన పోలీసులు ముగ్గురు దొంగలను గురువారం అరెస్ట్ చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు. దొంగతనానికి పాల్పడిన వారిలో ఒకరు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి 3 క్వింటాళ్ల పల్లీల బస్తాలు, రెండు మోటా ర్లు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## మాతాశిశు ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు చేపట్టాలి

• కలెక్టర్ రాజార్షిషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్



విద్యార్థులతో కలిసి భోజనం కలెక్టర్

ఉట్నూర్, జూలై4: ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలో మాతాశిశు సంరక్షణ కార్యక్రమాలు నిర్వీరామంగా చేటప్టాలని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ ప్రాజెక్టుఅధికారి క్యాంపు కార్యాలయంలో పీవో ఖుష్బుగుప్తాతో కలిసి ఏజెన్సీ పీఎస్సీల వైద్య సిబ్బందితో సమీక్షసమావేశం నిర్వహించారు. జిల్లావైద్య ఆరోగ్య శాఖ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పని చేస్తున్న వైద్యాధికారులతో సీజనల్ క్యాంపులు ఆర్‌బీసీ, పీఎం జన్మాన్, అప్పడమిక్ క్యాంపులు ఖచ్చితంగా నిర్వహించాలన్నారు. ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాతాశిశు ఆరోగ్యసంరక్షణ కార్యక్రమాలు, వ్యాధి నిరోధకటీకాలు, ఇమ్యునైజేషన్ 100 శాతం నిర్వహించాలని ఆదేశించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సాధారణ ప్రసవాలు నిర్వహించాలని అన్నారు. ఆశ్రమ పాఠశాలలకు సమయానికి మందులు అందే విధంగా చూడాలన్నారు. ఆశ్రమ పాఠశాలలో హెల్త్ రిజిస్టర్లు పాటించాలని, రోడ్లు లేని గ్రామాలను గుర్తించి అవ్వల్ అంబులెన్స్ పోయేలా మరమ్మతులు చేపడతామన్నారు. నీటి కొరత లేకుండా చూడాలన్నారు. అలాగే హైరీస్క్ ప్రాంతాలను గుర్తించాలన్నారు. వైద్యాధికారులు సమయపాలన పాటించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో మందుల కొరత లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా జిల్లా వైద్యాధికారులు డాక్టర్ రాథోడ్‌నరేందర్, అదనపు వైద్యశాఖ అధికారి కుడిమెత మనోహర్‌లు పాల్గొన్నారు.

### ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

నార్నూర్ మండలంలోని ఐటీడీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న జండ బాలికల ఆశ్రమ పాఠశాలను కలెక్టర్ రాజార్షిషా, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తాలు గురువారం ఆకస్మీకంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించిన అనంతరం బాలికల కోసం వండుతున్న వంటలను పరిశీలించి బాలికలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం వండిపెడుతూ బాలికలకు పౌష్టికా హారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఏడో తరగతిలో బాలికలతో మాట్లాడి వారి సామర్థ్యాలను పరిశీలించారు.

### 'ఎరువుల కొరత లేకుండా చర్యలు చేపట్టాలి'



రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

తలమడుగు, జూలై 4: రైతులకు ఎరువుల కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి మహేందర్ కోరారు. గురువారం మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయసహకార సంఘం కార్యాలయంలో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా మహేందర్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ పంటల సాగుచేసి రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. అలాగే రైతులకు ఎరువులు విక్రయించేటప్పుడు తప్పనిసరిగా ఆధార్ కార్డు నెంబర్ నమోదు చేయాలన్నారు. సహకార సంఘం ద్వారా విక్రయిస్తున్న డీఏపీ, యూరియా, ఎరువుల ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రతి రైతు వివరాలు ఆన్‌లైన్ నమోదు చేయాలని సూచించారు. మండలంలో చేపడుతున్న పంటల నమోదు కార్యక్రమం 50శాతం వరకు పూర్తయిందన్నారు. అనంతరం రిజిష్టర్లు పరిశీలించి ఎరువుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో సీఈవో శ్రీనివాస్, సెక్రటరీలు సాగర్, గంగయ్య, భీమారావు ఉన్నారు.

### పశువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి



ఆవుకు టీకా వేస్తున్న అధికారులు

తలమడుగు, జూలై 4: కొత్త నీరురావడంతో పశువులకు పలు అంటూ వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున ముందస్తుగా పశువులన్నింటికీ వ్యాధి నిరోధకటీకాలు వేయించుకోవాలని మండల పశు వైద్యాధికారి దుర్గంరాథోడ్ అన్నారు. గురువారం మండలంలోని కోసాయి గ్రామంలో పశువైద్యశిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పశువులలో లంపి స్కిన్ వ్యాధి వైరస్ వల్ల వస్తుందని, ఒక పశువు నుంచి మరో పశువుకు సోకే అకవాశం ఉందని, గర్భం దాల్చిన పశువులు ఇస్కపోతాయని, పాలిచ్చే ఆవులు గేదెలో పాలదిగుబడి తగ్గుతాయని, చిన్నా ఆవుదూడలకు ఈ వ్యాధి వస్తే చనిపోయే అవకాశాలు మెండుగా ఉంటాయని కావున ఇట్టి టీకాలను తప్పక పశువులకు ఇప్పించి సద్విని యోగం చేసుకోవాలని కోరారు. పశువైద్యఅధికారి డాక్టర్ దుద్‌రామ్ రాథోడ్ సిబ్బంది స్వామి, సౌమ్య, విజయ్, సుదర్శన్, గోపాల మిత్రులు రాజు, గంగన్న, జంగు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పెన్‌గంగా పరీవాహక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

• జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం



నదిని పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్‌ఆలం

జైనథ్, జూలై4: జైనథ్, బేల మండలాల సరిహద్దు గల పెన్‌గంగా నది పై రానున్న వర్షాకాలంలో నది పరివాహక ప్రాంతాల పై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం అన్నారు. గురువారం మండల కేంద్రమైన జైనథ్‌రూరల్ సీఐ కార్యాలయాన్ని, బేల మండల కేంద్రంలో గల బేల పోలీసుస్టేషన్‌ను ఎస్పీ అకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు స్టేసన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరిగే విధంగా విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి నూతన చట్టాలు అమలులోకి వచ్చినందున కొత్త చట్టం పై కేసులు నమోదు చేయాలన్నారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం ఉన్నందున అసాంఘీక కార్యక్రమాలు జరుగడానికి ఆస్కారం ఉందన్నారు. పలు అంశాల పై స లహాలు సూచనలు అందజేశారు. పోలీసులుగౌరవ వందనం స్వీకరించి జైనథ్, బేల పోలీసు స్టేషన్‌లలో ఎస్పీ మొక్కలను నాటారు. జైనథ్ సీఐ డి.సాయినాథ్ ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, బేల ఎస్సై రాధికలతో పాటు జైనథ్, బేల పోలీసు సిబ్బంది ఉన్నారు.



రాథోడ్ రమేష్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ చిట్యాల సుహాసిని రెడ్డి

### రాథోడ్ రమేష్‌కు ప్రముఖుల నివాళులు

ఉట్నూర్, జూలై 4: దివంగత మాజీ ఎంపీ రాథోడ్‌రమేష్ చిత్రపటానికి గురువారం ప్రముఖులు నివాళులర్పించారు. ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతోపాటు మాజీ జడ్పీ చైర్‌పర్సన్ చిట్యాల సుహాసినిరెడ్డి రాథోడ్ రమేష్ చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాథోడ్ రమేష్ అనతి కాలంలోనే ఉమ్మడి జిల్లాలోని ప్రజల మనసులు గెలుచుకున్న మహానీయుడని అన్నారు. ఆయన మరణం జిల్లా ప్రజలకు తీరని లోటు అని అన్నారు. ఏ పార్టీలో ఉన్న ఏ పదవిలో ఉన్నా తాను ముందుండి కార్యక్రమాలను నడిపించే వాడని కొనియాడారు. ఇదిలా ఉండగా మాజీ విజయ డైరీ చైర్మన్ లోక భూమారెడ్డి రాథోడ్ రమేష్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సతీమణి, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ సుమన్ తనయులు రాథోడ్ రితేష్ రాథోడ్ రాహుల్‌లను పరామర్శించారు.

### 'రైతు భరోసాతో రైతులకు మేలు'

ఉట్నూర్, జూలై4: ప్రభుత్వం అమలుచేస్తున్న రైతు భరోసాతో ద్వారా రైతులకు ఎంతో మేలు జరగనుందని, మరిన్ని ప్రయోజనాలు అందుబాటులోకి రానున్నాయని ఉట్నూర్ సింగిల్ విండో చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ సామ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహాజన సభకు రైతులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చైర్మన్ ఎస్‌పీరెడ్డి మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఐదు ఎకరాలలో ఉన్న రైతులకు రైతుభరోసా ఇస్తే సరిపోతుందని, రైతులు పేర్కొనడం శుభపరిణామమన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న గిరిజనులు, గిరిజనేతర రైతులకు కూడా రైతు భరోసా పథకం ద్వారా లబ్ధి కలగాలని రైతులు సూచించారు. వ్యవసాయ అధికారి రాథోడ్ గణేష్ మాట్లాడుతూ రైతుల మేలు కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కుడుమెత సుధాకర్, సహకార సంఘం సీఈఓ మల్లయ్య, సెక్రటరీ తొగిటిఅశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### రైతు భరోసాపై రైతుల అభిప్రాయ సేకరణ

ఇంద్రవెల్లి, జూలై 4: రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ డోంగ్రే మారుతి పటేల్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని స్థానిక రైతువేదికలో జరిగిన రైతులకు ప్రత్యేక మహాజనసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుభరోసా పథకంపై రైతులు తమ అభిప్రాయాలను నేరుగా వ్యక్తపరచాలని కోరారు. ఈ కార్యక్రమానికి రైతులు అధికసంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలను స్వయంగా తెలిపారు. 10 ఎకరాలలోపు వరకు భూమిఉన్న వారికి మాత్రమే రైతుభరోసా సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి అరుణ, సహకార సంఘం సీఈవో ధర్మసింగ్, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్న రైతు

# దుష్ప్రచారాలను ప్రజలు నమ్మవద్దు

● కొత్త చట్టం ప్రకారం కేసు నమోదు : భైంసా ఏఎస్పీ


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాష్

భైంసా రూరల్, జూలై 4 : ముగ్గురు వ్యక్తుల మధ్య వాగ్వాదం విషయంలో బీఎన్ఎస్ ప్రకారం తొలి ఎఫ్ఐఆర్ భైంసా పట్టణంలోని పోలీసు స్టేషన్‌లో నమోదు అయ్యిందని, ఈ విషయంలో దుష్ప్రచారాలను నమ్మవద్దని ఏఎస్పీ అవినాష్‌కుమార్ అన్నారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భైంసా మండలం కుంసర గ్రామంలో ముగ్గురు వ్యక్తుల మధ్య వాగ్వాదం జరిగి రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారి తీసిందన్నారు. దీనిపై జిల్లా ఎస్పీ జానకి షర్మిల పర్యవేక్షణలో వేగంగా స్పందించిన పోలీసులు కొత్తచట్టం బీఎన్ఎస్ ప్రకారం తొలి ఎఫ్ఐఆర్ నమోదు చేశారని తెలిపారు. రూరల్ సీఐ నైలు, ఎస్సై శ్రీకాంత్ స్థానిక పోలీసులు ఈ ఘర్షణకు కారణమైన వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి తరలించారన్నారు. ఈ విషయం గురించి సోషల్‌మీడియాలో తప్పుడు సమాచారం చేయకుండా ఉండాలని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఘటన నేపథ్యంలో ఎస్పీ జానకీషర్మిల పర్యవేక్షణలో నిర్మల్ పోలీసుల ఐటీ బృందం సోషల్ మీడియాపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ పెట్టారు. ఈ సమావేశంలో సీఐ రాజారెడ్డి, రూరల్ సీఐ నైలు, ఎస్సైలు, పోలీసుల బృందం పాల్గొన్నారు.

# రమేష్ రాథోడ్ మరణం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు తీరని లోటు

● ఖానాపూర్‌లో నివాళులు అర్పించిన అభిమానులు


ఖానాపూర్‌లో రాథోడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆయా పార్టీల నాయకులు

ఖానాపూర్, జూలై 4 : మాజీ ఎంపీ రమేష్‌రాథోడ్ మృతి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు తీరని లోటని బీజేపీ శ్రేణులు అభిప్రాయపడ్డాయి. గురువారం బీజేపీ ఆధ్వర్యంలో ఖానాపూర్‌లోని తెలంగాణ చౌక్‌లో రమేష్ రాథోడ్ సంతాపసభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా పలువురు నాయకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ... ఎమ్మెల్యేగా, ఎంపీగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు రమేష్ రాథోడ్ చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలిచి ఉంటాయన్నారు. చిన్న పెద్ద అనే తేడా లేకుండా ఎవరు ఫోన్ చేసినా స్పందించే వ్యక్తిగా రమేష్ రాథోడ్ ఈ ప్రాంత ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. రమేష్ రాథోడ్ పదవిలో ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజల్లో ఉండే వ్యక్తి అని వక్తలు కొనియాడారు. ఆయన మరణంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓ సీనియర్ రాజకీయ నాయకుడిని, నిరంతర ప్రజా సేవకుడిని కోల్పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మాజీ సర్పంచ్ అకుల శ్రీనివాస్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు తోట సత్యం, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ అంకం మహేందర్, పట్టణ అధ్యక్షుడు నాయిని సంతోష్, జిల్లా నాయకుడు డి. మల్లయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మంత్రరాజం సురేష్, న్యాయవాది మట్టేరి రాజశేఖర్, శైలేందర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**పెంబిలో..**

**పెంబి రూరల్** : ఆదిలాబాద్ మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ ఇటీవల మృతి చెందడంతో గురువారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు రాథోడ్ రమేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి జ్ఞాపకార్థంగా మండల కేంద్రంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు ఐదు వెంకటేష్ మాట్లాడుతూ.. ఆదిలాబాద్ ఎంపీగా, ఖానాపూర్ ఎమ్మెల్యేగా రాథోడ్ రమేష్ సేవలు మరువలేనివని, వారి మరణం తీరని లోటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సల్ల రామేశ్వర్‌రెడ్డి, పుప్పాలరవి, చింతకింది రాజేందర్, నర్రా కృష్ణారెడ్డి, భూక్యా రాజు, బాపురావు, అశోక్, తదితరులు ఉన్నారు.

ముథోల్‌లో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో

## పాఠశాలల బంద్ విజయవంతం



ముథోల్‌లో బంద్ పాటిస్తున్న విద్యార్థులు

ముథోల్, జూలై 4 : నీట్‌పేపర్ లీకేజీను నిరసిస్తూ జాతీయవ్యాప్తంగా పాఠశాలలు, విద్యాసంస్థలు బంద్ సందర్భంగా గురువారం ముథోల్ పట్టణంలో ప్రభుత్వ విద్యాసంస్థలు, ప్రైవేట్ విద్యాసంస్థలు ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్ (ఏఐఎస్‌బీ)ఏ ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్ రాష్ట్ర అధ్యక్షులు జవారే రాహుల్ మాట్లాడుతూ... నీట్ పరీక్ష పేపర్ లీకేజీ, పేపర్ అమ్ముకోవడంపై కేంద్రప్రభుత్వం మౌనంగా ఉండడం దారుణమన్నారు. 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం ఆడుకుంటుందని, కేంద్ర ప్రభుత్వం నిర్వహించే పరీక్షలపై నమ్మకం లేకుండా పోతుందని ఆరోపించారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ, అమ్ముకోవడంపై సాక్ష్యాలు ఉన్నా.. నిజమని తేలినా.. ఎందుకు మౌనంగా ఉంటుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నీట్‌పరీక్షను వెంటనే రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఎన్‌టీఏ సంస్థను వెంటనే రద్దు చేయాలని, 24 లక్షల మంది నీట్ పరీక్ష రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా 70 వేలకు పైగా విద్యార్థులు నీట్ పరీక్ష రాశారన్నారు. నష్టపోయిన 24 లక్షల మంది విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. అలాగే ఎన్‌టీఏ సంస్థను వెంటనే రద్దు చేయాలని, పేపర్ లీకేజీ అయిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు.మళ్లీ నీట్ ఎగ్జామ్‌ను నిర్వహించాలని, కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మైనారిటీ కంప్యూటర్ శిక్షణ కేంద్రాలను

## వినియోగంలోకి తీసుకురావాలి


ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో మాట్లాడుతున్న ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసా, జూలై 4 : నియోజక వర్గ పరిధిలోని భైంసా, ముథోల్ కేంద్రాల్లో మూతపడ్డ మైనారిటీ కంప్యూటర్ శిక్షణ కేంద్రాలను వినియోగంలోకి తీసుకరావాలని ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి విజ్ఞప్తి చేశారు. గురువారం సంబంధిత విషయంలో హైదరాబాద్‌లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ ఆలీని కలిసి వినతి పత్రం అందచేశారు. కంప్యూటర్ శిక్షణ కేంద్రాలను వినియోగంలోకి తీసుకవస్తే ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు.శిక్షణ కేంద్రాల నిర్వాహణకు, సదుపాయల కల్పనకు అవసరమైన నిధులు విడుదల చేయాలని తెలిపారు. ఇదే క్రమంలో మైనారిటీల కోసం గతంలో మంజూరు చేయబడిన వివిధ పథకాల స్థితిగతులను వివరించి వాటికి సంబంధించి పెండింగ్‌లోనున్న బిల్లుల విడుదలకు చర్యలు చేపట్టాలని కోరారు. ఇందుకు స్పందించిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం చర్యలు చేపడుతానని హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో మరణించిన

## అధ్యాపకుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

భైంసా, జూలై 4 : రోడ్డు ప్రమాదం బారిన పడి మృతి చెందిన ఆధ్యాపకుని కుటుంబీకులకు టీవీటీఏ యూనియన్ శ్రేణులు ఆర్థిక సహాయ అందించి అండదండగా నిలిచారు. కుంటాల మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో వృత్తి విద్యా ఆధ్యాపకునిగా విధులు నిర్వహిస్తున్న భైంసా మండలంలోని వానల్‌పాడ్ గ్రామానికి చెందిన నవీన్ గత నెలలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.దీంతో ఆధ్యాపకుని కుటుంబం ఆధారాన్ని కోల్పోయి సంపూర్ణ నిరాశ్రయులయ్యారు. సంబంధిత సమాచారం తెలుసుకున్న తెలంగాణ వొకేషనల్ ట్రైనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇంజం శివకుమార్ నేతృత్వంలో అసోసియేషన్ శ్రేణులు గురువారం వానల్‌పాడ్ గ్రామానికి వచ్చి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.70 వేల ఆర్థిక సహాయం అందచేశారు.రానున్న రోజుల్లో అవసరమైన సహాయ,సహకారాలు అందించి తోడ్పాటునిస్తామని వెల్లడించారు.

## నర్సాపూర్ (జి) పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ


రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

నర్సాపూర్(జి), జూలై 4 : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను గురువారం డివిజనల్ పోలీస్ ఆఫీసర్, ఏ.గంగారెడ్డి తనిఖీ నిర్వహించారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మునిగెల హన్మాండ్లు సిబ్బందితో కలిసి గౌరవ వందనం సమర్పించారు. పరేడు అనంతరం పోలీసుల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. పోలీసులు ప్రజల మన్ననలు పొందేలా విధులు నిర్వహించాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా మాట్లాడాలని, ప్రజలు తీసుకువచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి న్యాయం పొందేలా చేయాలని అన్నారు. సిబ్బందితో కలిసి పోలీసుస్టేషన్ పరిసరాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ సీఐ శ్రీనివాస్, ఎస్సై హన్మాండ్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళల భద్రతే షీ టీమ్స్ లక్ష్యం


మహిళలకు అవగాహన కల్పిస్తున్న షీ టీమ్ మహిళలు

సారంగాపూర్, జూలై 4 : మహిళల భద్రతే షీ టీమ్స్ లక్ష్యమని షీ టీమ్ మహిళా అధికారులు అన్నారు. గురువారం మండలంలోని చించోలి(బి) గ్రామ సమీపంలో గల మహిళా ప్రాంగణంలో షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. షీ టీమ్ చేస్తు న్న సేవలను వివరించారు. మహిళలందరూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, అపరిచిత వ్యక్తులతో ఫోన్‌కాల్స్ మాట్లాడవద్దన్నారు. అపరిచిత వ్యక్తుల ఫోన్‌ల నుంచి గ్రూపులు ఏవైనా లింకులు వస్తే వాటిని ప్రెస్ చేయవద్దని వివరించారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి సమస్యను వివరించి వెంటనే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు ఆపదలో ఉన్న సమయంలో డయల్ 100, షీ టీమ్ నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నర్సాపూర్(జి), జూలై 4 : మండల కేంద్రలోని ప్రాథమిక ఆశ్రమ పాఠశాల పరిసరాలను ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు సలహాలు, సూచనలు అందించారు. ఆహారం వేడిగా ఉన్నప్పుడే తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన

## పెంబి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

పెంబి రూరల్, జూలై 4 : బాసర ట్రిపుల్ ఐటీకి పెంబి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంచందర్ తెలిపారు. గురువారం పాఠశాలలో ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులు సుమతి, జోగు షాలిని, శివాణి, అర్చన, శ్రీలతలకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు విద్యార్థులను అభినందించారు. అనంతరం శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు స్వప్నిల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, తులాల శంకర్, గాండ్ల శంకర్, మతిన్, బింగి రవి, జోగు రమేష్, కాసీం, పెండల నరేష్, తులాల వినోద్, శ్రీనివాస్, భూమేష్, ప్రధానోపాధ్యాయులు రాంచందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## ఉపకార వేతనాల విడుదలకు చర్యలు చేపట్టండి

భైంసా, జూలై 4 : పెండింగ్‌లోనున్న ఉపకార వేతనాల విడుదలకు చర్యలు చేపట్టి తమను ఆదుకోవాలని జిల్లా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ప్రతినిధులు ముథోల్ ఎమ్మెల్యే పి.రామరావ్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సంబంధిత విషయంలో గురువారం భైంసాలో అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే రామరావ్ పాటిల్‌ను కలిసి వినతి పత్రం అందచేశారు. గత మూడు సంవత్సరాలుగా ఉపకార వేతనాలు విడుదల కాకపోవడం మూలంగా కళాశాల నిర్వహణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సచిన్

## పోడు సాగుదారులపై అటవీ అధికారుల దాడులు ఆపాలి

● టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్

ఇంద్రవెల్లి, జూలై 4: పోడు సాగుదారులపై అటవీ అధికారుల దాడులు ఆపాలని, ఏళ్ల నుంచి సాగు చేస్తున్న భూముల్లో మొక్కలు నాటే పేరుతో సాగు భూములను లాక్కోవడం తగదని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీజేజీఎస్) రాష్ట్రప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్‌చేశారు. గురువారం మండలంలోని పిప్రి గ్రామంలో విజ్ఞాన సైనికుడు, మాజీ టీఏజీఎస్ జిల్లా అధ్యక్షుడు మెస్రం మనోహర్ 2వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెస్రం మనోహర్ గిరిజన ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంచేందుకు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా వాస్తవాలను తెలిపిన విజ్ఞాన సైనికుడని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో గిరిజన సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అంటూ చెబుతూనే పోడు సాగుదారులపై అటవీశాఖతో జులుంచేయిస్తూ పోడు భూములను లాక్కోవాలని చూస్తోందని ఆరోపించారు. ప్రతీరోజు ఏదో ఒకచోట పోడు సాగుదారులపై ఫారెస్టు అధికారులు దాడిచేస్తూ పోడు సాగుదారులని ఇబ్బందులకు గురిచేయడం తగదని హెచ్చరించారు. దాడులు ఆపకపోతే ఫారెస్టు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తొడసం భీంరావు, మెస్రం రాజు, జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు, గ్రామ పటేల్ కోరెంగ మారు, శంభు, జ్యోతిరం తదితరులు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులపై కళాజాతా

ఇంద్రవెల్లి, జూలై4: మండలంలోని ఏమ్మైయికుంట గ్రామ పంచాయతీ పరిధిలోని గలియాబాయి తండాలో తెలంగాణ సాంస్కృతి సారథి ఆధ్వర్యంలో గురువారం సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళాజాతా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాదవ్ లఖన్, కళాజాత బృందం సభ్యులు నగేష్, శంకర్, పురుషోత్తం, గోవింద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగుల సేవలు మరువలేనివి: పీవో

ఉట్నూర్, జూలై 4: ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో దఫ్తేదారుగా పనిచేసిన బింగి లక్ష్మణ్ అలాగే ఆఫీస్ ఆర్డినేట్ నరసయ్యల సేవలు మరువలేనివని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. ఐటీడీఏలో దఫ్తేదారుగా పని చేసిన బింగి లక్ష్మణ్, సబార్డినేట్ లక్ష్మణ్‌లకు బుధవారం రాత్రి పదవీ విరమణ చేసిన సన్మాన సభ ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో పలువురు యూనిట్ అధికారులు, సిబ్బంది లక్ష్మణ్, నర్సయ్య సేవలను కొనియాడారు. గజమాలతో, శాలువాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ కనకభీమారావు, ఈఈ రా థోడ్ భీమ్‌రావ్, డీడీ దలీప్‌కుమార్, ఏఓ రాంబాబు, పీహెచ్‌ఓ సందీప్, డీపీ ఓ ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, మేస్రం మనోహర్, ఐటీడీఏ మేనేజర్ ఆ త్రంలింగు, ఆయా శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఓ ఖుష్బుగుప్తా

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● జడ్పీ చైర్మన్ జనార్దన్




ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ రాజార్షిషా




మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ రాథోడ్‌జనార్దన్

ఉట్నూర్, జూలై4: నీతిఆయోగ్ ఆధ్వర్యంలో నార్నూర్ మండలకేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమానికి జడ్పీ చైర్మన్ జనార్దన్‌రాథోడ్‌తోపాటు ముఖ్య అతిథిగా కలెక్టర్ రాజార్షిషా, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్‌జనార్దన్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల వైద్యశాఖతోపాటు పంచాయతీరాజ్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. ఈ సందర్భంగా నీతి అయోగ్ ఆధ్వర్యంలో నార్నూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా ఆశ, అంగన్‌వాడీలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో అత్యవసర సమయంలో గర్భిణీలు బాలింతలు ఆసుపత్రులకు వెళ్లాలంటే అనేక అవస్థలకు గురవుతున్నారని, గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు కల్పించాలని అన్నారు. అనంతరం గత ప్రభుత్వం హాయంలో గంగాపూర్ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి మహాగావ్ వరకు మంజూరు అయిన రోడ్డు పనులను అతిత్వరలో పూర్తి చేయించాలని కలెక్టర్‌కు విన్నవించారు. అలాగే వర్షాకాలంలో వైరల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి మలేరియా డెంగ్యూ సోకకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు. అనంతరం పదవీకాలం పూర్తి చేసుకున్న ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానించారు. అలాగే అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీమహిళలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లను తిలకించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ నరేందర్, ఐటీడీఏ పీవీటీజీ ఏపీవో డాక్టర్‌కుడిమెత మనోహర్,స్థానిక మండల ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, మాజీ సర్పంచ్ గజానంద్‌నాయక్, అంగన్‌వాడీలు ఉన్నారు.

### విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకే సీజీఆర్ఎఫ్ వేదిక

ఇంద్రవెల్లి, జూలై4: గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకే సీజీఆర్ఎఫ్ వేదికలు ఏర్పాటు చేస్తున్నట్లు సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎస్.రామకృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యుత్ వినియోగదారులు, విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి సబ్‌స్టేషన్ పరిసర ప్రాంతంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పలువురు విద్యుత్ వినియోగదారులు హాజరై విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సీజీఆర్ఎఫ్ ద్వారా తమ దృష్టికి వచ్చిన ప్రతీ విద్యుత్ సమస్యను పరిష్కరిస్తామని ఈ సందర్భంగా వెల్లడించారు. విద్యుత్ వినియోగదారులు సీజీఆర్ఎఫ్ వేదికల ద్వారా విద్యుత్ సమస్యలను పరిష్కరించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ సుభాష్, హెచ్ఏవో దిగంబర్, జేవో అగర్వాల్, జేఈ రోహిదాస్, లైన్‌మెన్లు దుర్గరాజ్, నందలాల్, విద్యుత్ వినియోగదారులు ఉన్నారు.

### ఆలోచన అదిరెంది..!

● ద్విచక్ర వాహనంతో సోయాలో కలుపు తీత



బజార్‌హత్నూర్, జూలై4: వ్యవసాయానికి అవుతున్న అదనపు ఖర్చును తగ్గించుకునేందుకు రైతు ఓ వినూత్న ప్రయోగాన్ని అమలు చేస్తున్నాడు. స్వల్ప ఖర్చుతో కలుపు మొక్కల నివారణకు నడుం బిగించారు. మండలం పరిధిలోని భూతాయి గ్రామానికి చెందిన రైతులు రబాడే సంతోష్, రవి కలిసి బైకుకు ఇరువైపులా రెండు దౌరలను ఏర్పాటు చేసి సోయా పంటలో కలుపు మొక్కలను తొలగించాడు. రూ.3వేల ఖర్చును, బైకులో లీటరు పెట్రోలుతో కలుపుతీసి చూపిస్తున్నాడు.

### 'సార్.. మమ్మల్ని వదిలి వెళ్లొద్దు'

● బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడ్ని చుట్టుముట్టిన విద్యార్థులు

బజార్‌హత్నూర్, జూలై4: బజార్‌హత్నూర్‌లోని జిల్లాపరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థులు తమ ఉపాధ్యాయులను చుట్టుముట్టి కన్నీళ్లు పెట్టారు. బజార్‌హత్నూర్‌లోని జిల్లాపరిషత్ సెకండరీ పాఠశాలలో ఇంగ్లిష్ బోధిస్తున్న ఆర్‌టీపీ ప్రసాద్ తొమ్మిదేళ్లగా ఇదే పాఠశాలలో విధులు నిర్వహించారు. అయితే బదిలీల్లో భాగంగా ఉపాధ్యాయుడు ప్రసాద్ బోథ్ మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలకు వెళ్తున్న సందర్భంగా పాఠశాలలో వీడ్కోల సభలో ఏర్పాటు చేయగా.. భావోద్వేగానికి లోనైన విద్యార్థులు 'సార్ మీరు ఎక్కడికీ వెళ్లొద్దు' అంటూ ఉపాధ్యాయుడ్ని కన్నీరుపెట్టారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరేష్, ఉపాధ్యాయులు భూమన్న, బాపురావ్‌లు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడిని చుట్టుముట్టిన విద్యార్థులు




దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

## దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో పోరాడాలి

● జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వెంకటనారాయణ

ఆదిలాబాద్ అర్బన్, జూలై4: తెలంగాణ సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో మోదీ ఫాసిస్టు శక్తులను ఓడించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకటనారాయణ పిలుపునిచ్చారు. గురువారం దొడ్డికొమురయ్య 78వ స్మారకదినం సందర్భంగా సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కొమురంభీం భవనంలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బి.వెంకటనారాయణ మాట్లాడుతూ పోరాటం లేకుండా చరిత్రలో మార్పు లేదని, భారతదేశ వ్యవసాయ దేశమని దేశంలో భూమిలేని నిరుపేదలు కొట్లాది మంది ఉన్నారన్నారు. పేదల సమస్యను పరిష్కరించడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. భూమి కోసం భుక్తి కోసం ఈ దేశ విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తొలిఅమరుడు దొడ్డి కొమురయ్య అని తెలిపారు. నేడు మోదీ ప్రభుత్వం రైతు కూలీలను మోసం చేస్తోందని, రైతుకార్మిక వ్యతిరేక చట్టాలతో ప్రజల హక్కులను కాలరాస్తోందని అన్నారు. రైతుల భూమిని కార్పొరేట్ కంపెనీలకు అప్పచెప్పే కుట్ర చేస్తూ రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను నరేంద్రమోదీ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. రైతు కార్మిక వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే నిర్బంధిస్తూ, ఫాసిస్టు విధానాలు అవలంభిస్తూ ప్రజా ఉద్యమాల పై తీవ్ర నిర్బంధాన్ని ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల వాగ్దానాలను విస్మరించి ఉపాధి భద్రత విషయం గాలికి వదిలివేశారని తెలిపారు. ఇందులో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎ ర్రజి హరీష్, మడావి గణేష్, ఉపాధ్యక్షులు దీపలక్ష్మి, సహాయ కార్యదర్శి దత్తు, పూజ, అజయ్, అర్జున్, శ్రీకర్, పీవైఎల్ నాయకులు ఉన్నారు.

### స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలి

● తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి

ఆదిలాబాద్ రూరల్, జూలై4: స్వామి వివేకానందుడి బోధనలు అనుసరణీయమని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం స్వామి వివేకానంద వర్ధంతిని పురస్కరించుకుని ఆదిలాబాద్ పట్టణంలోని న్యూస్ హౌసింగ్ బోర్డు కాలనీలోని స్వామి వివేకానంద విగ్రహానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నేటి యువత స్వామి వివేకానందును బోధనాలను ఆకస్మికంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## సమయపాలన పాటించకుంటే చర్యలు

● డీఈవో ప్రణీత



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి

తలమడుగు, జూలై 4: ఉపాధ్యాయులకు సమయపాలన పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా విద్యాధికారి ప్రణీత కోరారు. గురువారం మండలంలోని పల్లి బి హైస్కూల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విధులు నిర్వహించే ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయ పాలన పాటించాలన్నారు. అదే విధంగా ప్రతీ విద్యార్థికి అర్థమయ్యే విధంగా విద్యబోధన అందించాలన్నారు. ముఖ్యంగా పాఠశాలలో మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేకదృష్టి ఇప్పటినుంచే పెట్టాలని సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో ఎంఈవో నారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### రేషన్ బియ్యం పట్టివేత

ఆదిలాబాద్ రూరల్, జూలై4: ఆదిలాబాద్ అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. తిర్పెల్లి వద్ద గురువారం టూ టౌన్ సీఐ అశోక్ ఆధ్వర్యంలో ఐడీ పార్టీ నరేష్, క్రాంతికుమార్ వాహనాల తనిఖీలు చేస్తుండగా ఓ ఆటోలో 3క్వింటాళ్ల 80కిలోలు రేషన్‌బియ్యాన్ని పట్టుకున్నారు. ఆటోను సీజ్ చేసి, డ్రైవర్ షేక్ అద్నాన్‌ను అరెస్ట్ చేసి, స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పౌర సరఫరా శాఖకు అప్పగించినట్లు తెలిపారు.

### పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ఆదిలాబాద్ రూరల్, జూలై4: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం ఆదిలాబాద్ రూరల్ మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కచ్కంటి గ్రామానికి చెందిన దాసరి ఆశన్న భార్య లక్ష్మి ఏడాది క్రితం గొడవల కారణంగా పుట్టింటికి వెళ్లి అక్కడే ఉంటుంది. దీంతో మనస్థాపం చెందిన ఆశన్న (40) గురువారం పంటచేనులో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

### 'అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ధిలో ముందుంచా'

బోథ్, జూలై 4 : ఎంపీపీ ఆ పదవిలో ఉన్నంత కాలం మండల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశానని, అందరి సహకారంతో ముందు ఉంచానని బోథ్ ఎంపీపీ తులా శ్రీనివాస్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలానికి రెండు కోట్ల 17 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. తాను తన శక్తి మేరకు గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, పాఠశాలల మరమ్మతులు, అంగన్‌వాడీ సెంటర్ల నిర్మాణం చేయించడం జరిగిందన్నారు. తాను తీసుకు వచ్చిన నిధులతో పనులు జరిగేందుకు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సహకారం అందించారన్నారు. నాపై ఉన్న అభిమానంతో రాష్ట్ర స్థాయిలో ఉన్న మంత్రులు సైతం అడుగగానే నిధులు ఇచ్చారని వివరించారు. పదవిలో ఉన్నా లేకున్నా తాను ప్రజల వెంటే ఉంటానని ప్రజాసంక్షేమం కోసం పాటుపడతానన్నారు. గతంలో మాదిరిగానే ఏమైనా ఇబ్బందులు ఉంటే ప్రజలు నా దృష్టికి తీసుకురావాలని కోరారు.

### భీంపూర్ మండల స్పెషల్ ఆఫీసర్‌గా కిషన్

భీంపూర్, జులై 4 : మండల స్పెషల్ ఆఫీసర్‌గా జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కిషన్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు.

## దొడ్డికొమురయ్య ఆశయం కోసం ఉద్యమించాలి



దొడ్డికొమురయ్య, మేస్రం మనోహర్‌ల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, జూలై 4: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట మొట్టమొదటి అమరవీరుడు దొడ్డికొమురయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. దొడ్డికొమురయ్య 78వ వర్ధంతి ,పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మేస్రం మనోహర్ రెండవ వర్ధంతిని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం సుందరయ్య భవనంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరి చిత్రపటాలకు పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లంక రాఘవులు, సీనియర్ నాయకులు బండిదత్తాత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట మొట్టమొదటి అమరవీరుడు దొడ్డికొమురయ్య అన్నారు. 1946 జూలై 4న విష్ణూర్ రామచంద్రారెడ్డి గుండాల కాల్పుల్లో మృతి చెందారన్నారు. ఆయన మృతిని స్ఫూర్తిగా తీసుకొని రెట్టింపు ఉత్సాహంతో తెలంగాణ ప్రజలు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. దీంతో నిజాం ప్రభుత్వం కుప్పకూలడం తెలంగాణ విముక్తి కావడం, లక్షలాది ఎకరాల భూమిని పంచి, వెట్టిచాకిరిని తుదముట్టించిన పోరాటంగా తెలంగాణ సాయుధ పోరాటం చరిత్రలో నిలిచి పోయిందన్నారు. కామ్రేడ్ మేస్రం మనోహర్ చిన్నవయస్సులోనే సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడిగా,తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘానికి జిల్లా అధ్యక్షుడిగా ఎదాగారని పేర్కొన్నారు. పోడుభూములకు హక్కు పత్రాలు, ఆదివాసుల హక్కుల కోసం ఉద్యమించారని తెలిపారు. దొడ్డి కొమురయ్య, మేస్రం మనోహర్‌ల ఆశయం కోసం సీపీఎం పార్టీ శ్రేణులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇందులో పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు ఆర్.మంజుల, మంజుల, నాయకులు ఎస్.స్వామి, కె.ఆశన్న, లంక జమున, కోవేశకుంతల, సీఐటీయూ నాయకులు అగ్గిమల్ల స్వామి, పార్టీ భీంపూర్ మండల కన్వీనర్ ధోనిపెల్లి స్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా కో కన్వీనర్ కోట్నాక్ సక్కు తదితరులు పాల్గొన్నారు.

### మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

నేరడిగొండ, జూలై 4 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలలుగన్న మహిళా సమైక్య సంఘాలను కోటీశ్వరులుగా మార్చడే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తున్న మహిళ సంఘాలను బలోపేతం చేస్తూ పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే ఉద్దేశంలో మండలంలోని కుమారి గ్రామ సరస్వతీ గ్రామైక్య సంఘం ఎంపికైనందున ఆదిలక్ష్మి సంఘం 2002 నుంచి అంచలంచెలుగా ఎదుగుతూ నేడు 12లక్షల 50వేల రుణాన్ని తీసుకోగా, భారీ సరస్వతి అను సభ్యురాలు 2002 నుంచి ఇప్పటి వరకు 65 సంవత్సరాలు సంఘం కోసం పని చేస్తూ గురువారం రిటైర్మెంట్ తీసుకొని డబ్బులను రూ.22వేలను సంఘ సభ్యులు శాలువాతో సన్మానించి విశ్రాంతి జీవితాన్ని గడపడానికి తమ సేవలను ఉపయోగించుకున్నందుకు ధన్యవాదాలు తెలుపుతూ వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో సీసీలు లింగరాజు, వీఓఏ లక్ష్మన్న, గ్రామైక్య మహిళ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### కుమారిలో పంటల నమోదు

నేరడిగొండ, జూలై 4 : గ్రామాలలో రైతులు వేసిన పంటను వ్యవసాయ అధికారి ఏఈఓ అపర్ణ వ్యవసాయ భూముల వద్దకు వెళ్లి పంటలను పరిశీలించి ఎవరు ఏ పంట వేశారో వారి పేర్లను నమోదు చేశారు. రైతు వేసిన పంటనే నమోదు చేస్తే మళ్లీ మార్కెట్ అమ్మడానికి ఇబ్బంది ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మందుల రమేష్, మాజీ సర్పంచ్‌రాజు, రైతులు అగ్గురమేష్, గజ్జన్న, లక్ష్మణ్, హరీష్‌కుమార్‌లున్నారు.

### జైనథ్‌లో ట్రిపుల్ ఐటీ సాధించిన విద్యార్థికి సన్మానం

జైనథ్, జూలై4: మండల కేంద్రమైన జైనథ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జైనథ్ గ్రామానికి చెందిన పిడుగు హరిప్రియ బాసర త్రిపుల్ ఐటీలో సీటు సాధించిన సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఆమెను పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. పదవ తరగతి పరీక్షలో 10 జీపికి 10 జీపీ మార్కులు సాధించి బాసరత్రిపుల్ ఐటీ సాధించడం జైనథ్ గ్రామానికి గర్వకారణమన్నారు. ఈ సమావేశలో పాఠశాల హెచ్‌ఎం ఎం.లస్మన్న, పీడీ ఎ.దయానంద్‌రెడ్డిలతో పాటు పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### మండల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన డీసీఓ మోహన్

బజార్‌హత్నూర్, జూలై 4 : జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం మండలానికి జిల్లాస్థాయి అధికారి డీసీఓ మోహన్‌ను ప్రత్యేక అధికారిగ నియమించింది. గురువారం మండల పరిశత్ కార్యాలయంలో ఆయన భాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీడీవో అతుల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సునీల్ పుష్ప గుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు. ప్రత్యేక అధికారి మాట్లాడుతూ పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మేకల వెంకన్న, మండల పరిషత్ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

### ప్రజా ప్రతినిధికి ఆదివాసుల ఘన సన్మానం

ఉట్నూర్, జూలై 4 : ఉట్నూర్ మండల పరిషత్ అధ్యక్షులు, ఆదివాసీ ప్రజా ప్రతినిధి పంద్రాజయవంత్‌రావుకు ఆదివాసీ గిరిజనులు పదవి చివరి రోజున ఘన సన్మానం నిర్వహించారు. ఉట్నూర్ మండలంలోని మత్తడిగూడ రాయిసెంటర్ సార్‌మేడినైతం చిత్రు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మండలంలోని ఆదివాసీ గూడాల ప్రతినిధులు హాజరయ్యారు. గడిచిన ఐదేళ్లలో ఎంపీపీగా జైవంత్‌రావు చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జైవంతరావు మాట్లాడుతూ గ్రామ వార్డు సభ్యుల నుంచి ఎంపీటీసీగా, ఎంపీపీగా సేవలు అందించానని అన్నారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్య క్రమాలు అందుకోవాలంటే ఆదివాసీ ప్రజా ప్రతినిధులను ఎన్ను కోవాలన్నారు.

### పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

బోథ్, జూలై 4 : సోనాలలోని రామాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ జీ.వి.రమణ జన్మదిన వేడుకలను అభిమానుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు.

### వారంతపు సంత వేలం వాయిదా

ఇంద్రవెల్లి, జులై 4 : మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే కూరగాయాల వారంతపు సంత 2024-25 ఏడాది నిర్వహణకు మేజర్ గ్రామ పంచాయితీ కార్యాలయ ఆవరణలో ఉట్నూర్ డీఎల్‌పీవో ప్రభాకర్‌రావు, ఎంపీడీవో భాస్కర్ సమక్షంలో గురువారం వేలం నిర్వహించారు. వేలంలో నిర్ణీత ధరకు తక్కువ పలకడంతో నేటికీ వాయిదా వేశామని తిరిగి యధావిధిగా శనివారం వేలం నిర్వహించనున్నట్లు డీఎల్‌పీవో తెలిపారు.

### తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామసభ డిమాండ్



కుభీర్, జూలై 4 : తాగునీటి సమస్య పరిష్కారానికి తీసుకోవాలని గ్రామసభ డిమాండ్ చేసింది. గురువారం మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ అయిన కుభీర్ జీపీలో గ్రామసభ నిర్వహించారు. ముందుగా పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ పంచాయతీ ఆదాయ వ్యయాలను ఇటీవల చేపట్టిన అభివృద్ధి పనులను గ్రామస్థులకు చదివి వినిపించారు. అనంతరం గ్రామస్థులు మాట్లాడారు. మిషన్ భగీరథ నీరు హరిజనవాడకు సరఫరా కావడం లేదని ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని అన్నారు. గ్రామంలో ఉన్న చేతి పంపులకు మరమ్మతులు చేపట్టక పోవడతో తాగు నీటి ఇబ్బందులు తప్పడం లేదని మిషన్‌భగీరథ ద్వారా వచ్చే నీరు పచ్చరంగు బురదమయంగా ఉందని తాగితే వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని అన్నారు. ఇదిలా ఉండగా గ్రామంలో తాగునీటిని సరఫరా చేసే మోటర్లకు విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని వాటిని ఎత్తివేస్తామని అధికారులు గ్రామసభలో ప్రస్తావించగా గ్రామస్థులు మండి పడ్డారు. యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. గ్రామ సభకు హాజరుకాని సంబంధిత శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని అధికారులతో కోరగా వారిపై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేస్తామని అన్నారు. తైబజారు వేలం పాట దక్కించుకుని డబ్బులు సక్రమంగా చెల్లించని వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ప్రతి గురువారం జరిగే వారసంతలో తాగు నీరు మరుగుదొడ్లు తదితర వసతులు కల్పించాలన్నారు. అనంతరం తాజామాజీ వైస్ ఎంపీపీ మోహినోద్దీన్, ఎంపీటీసీ పోసాని బాయిలకు అధికారులు, గ్రామస్థులు శాలువ పూలమాలతో ఘనంగా సన్మానించారు. పంచాయతీ ప్రత్యేకాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి


గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.2 | కనిష్ఠం 26.9

నిర్మల్ జిల్లా వార్తలు

8


శుక్రవారం 5 జూలై 2024





# ఆశల పల్లకిలో..

- అధిష్ఠాన పెద్దలపై కాంగ్రెస్ నేతల ఆశలు
- పదవులపై పంపిణీకి గ్రీన్ సిగ్నల్‌తో నాయకుల్లో ఆశలు
- మంత్రి పదవి కోసం ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు ప్రయత్నాలు
- ఓడిన అభ్యర్థులకు పదవులు ఉండవని సీఎం ప్రకటనతో నిరాశ
- అయినా పట్టు వదలకుండా ప్రయత్నాల్లో జిల్లా నేతలు
- నియోజకవర్గాల్లో పట్టు కోసం వర్గ పోరు



నిర్మల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ అధిష్ఠానంపై జిల్లాలోని ఆయా నియోజకవర్గాల నేత లు ఆశలు పెంచుకుంటున్నారు. దశాబ్ద కాలం అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇటీవలనే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. దీంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొనగా.. అధికార పదవులను పొందే క్రమంలో ఎవ రికి వారుగా ప్రయత్నాలు ప్రారం భించారు. ముందుగా నియోజకవర్గ స్థాయిలో ముఖ్యనేతలు పదవులు కలిగి ఉంటే తమకు అన్ని రకా లుగా అనుకూలంగా ఉంటుందని కిందిస్థాయి కార్యకర్తలు, ద్వితీయ స్థాయి నేతలు అభిప్రాయపడుతున్నారు. అయితే నామినేటెడ్ పదవులు ఇచ్చే విషయంలో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం వైఖరి భిన్నంగా కనిపిస్తుం దని నేతలు కాస్త నిరాశతో ఉన్నట్లుగా ఉంది. నిర్మల్ జిల్లాలో మూడు నియోజకవర్గాలు ఉండగా ఖానాపూర్ నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు కొనసాగుతుండగా నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో బీజేపీ ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, రామారావు పటే ల్‌లు కొనసాగుతున్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి ఇబ్బంది లేకపోగా నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి అన్ని తామై నడిపే అవకాశం అధిష్ఠానం కల్పించడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### మంత్రి పదవి కోసం బొజ్జు ప్రయత్నాలు..

ఖానాపూర్ నియోజకవర్గం నుంచి తొలిసారిగా కాంగ్రెస్ పార్టీ తర ఫున గెలుపొందిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మంత్రి పదవి కోసం ప్రయ త్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తున్నది. కొంతకాలంగా ఆయన పేరు మీడియాలో బలంగా నిలుస్తూ వస్తోంది. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం మంత్రివర్గ విస్తరణ విషయంలో నేడు రేపు అంటూ వాయిదా వేస్తూ వస్తున్న నేపథ్యంలో ఈ విస్తరణలో బొజ్జుకు అవకాశం దక్కుతుందో లేదోనన్న చర్చ మొదలైంది. అయితే బొజ్జు పటేల్ మాత్రం తన పట్టు విడవకుండా ప్రయత్నాలు సాగిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి నేరుగా సంబంధాలు కలిగి ఉన్న నేపథ్యంలో ఆయనకు అనూహ్యంగా మంత్రి పదవి దక్కే అవకాశాలున్నాయని కూడా ప్రచారం ఉంది. అయితే కేబినె ట్‌లో ఇప్పటికి ఆదిమ గిరిజన తెగలకు చెందిన సీతక్క మంత్రిగా కొన సాగుతుండగా తమ నేత బొజ్జుకు అవకాశం ఇస్తారో లేదోనని ఆయన అనుచరుల్లో ఉత్కంఠ ఉంది. అయితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు గట్టిగా ప్రయత్నాలు చేస్తున్న నే పథ్యంలో ఉమ్మడి జిల్లాకు చెందిన కొంతమంది ముఖ్య కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రేంసాగర్‌రావుకు కాకుండా వెడ్మ బొజ్జుకు అవకాశం ఇవ్వాలని అధిష్ఠానంపై ఒత్తిడి పెంచుతున్నట్లు తెలుస్తున్నది. దీనిపై పార్టీ వర్గాల్లో కూడా విస్తృత చర్చ కూడా జరుగుతోంది.

### ఎమ్మెల్యేలు లేని నియోజకవర్గాల్లో ఎలా !?

ఇక పార్టీ ఎమ్మెల్యేలు లేని నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో కాంగ్రె స్ పార్టీకి బలమైన సారథి ఉండాల్సిన అవసరం ఉందని పార్టీకి చెంది న నేతలు, కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. అయితే నియోజకవర్గ స్థాయి నేతలకు ఒక్కొక్కరికి పూర్తి బాధ్యతలు అప్పగిస్తే నియోజకవ ర్గాల్లో పార్టీ కార్యకర్తలకు న్యాయం జరుగుతుందన్న అభిప్రాయం కూడా ఉంది. అయితే పార్టీ అధిష్ఠానం సహా సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఓడిపో యిన ఎమ్మెల్యే అభ్యర్థులకు పదవులు ఇవ్వబోమని స్పష్టం చేయడంతో వారిలో నిరాశ నెలకొంది. అయితే ఓడిపోయిన వారే నియోజకవర్గాల్లో తమకు ఎమ్మెల్యేలతో సమానంగా ఉంటారని గతంలో రేవంత్ రెడ్డి ఒకసారి ప్రకటన కూడా చేశారు. అయితే అధికార హోదా లేకుండా పార్టీ కార్యకర్తలకు ఎలా న్యాయం చేయాలో అర్థం కావడం లేదని ముఖ్యనేతల్లో నిరాశ నెలకొంది.

### నిర్మల్ కాంగ్రెస్‌లో ఇదీ పరిస్థితి

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో నిర్మల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు ఓటమి పాలయ్యారు. అదే క్రమంలో కాంగ్రెస్ పార్టీలోకి మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి వచ్చి చేరారు. ఇదీ నియోజకవర్గంలో రెండు వర్గాలకు దారి తీసింది. ప్రస్తుత పరిస్థితులను బట్టి నియోజకవర్గంలో ఇప్పటికి శ్రీహరిరావు మాటనే చెల్లుబాటు అవుతున్నదన్న అభిప్రాయాలు కాంగ్రెస్ వర్గాల్లో ఉన్నాయి. ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటుండగా ప్రభుత్వ కార్యక్రమాల అమలుతో పాటు పలు ప్రజల నుంచి సమస్య లకు ముఖ్యమంత్రి సహాయనిధి వంటి అత్యవసర వ్యవహారాల్లో శ్రీహరి రావు కీలకంగా వ్యవహరిస్తున్నారు. అధికారులతో మాట్లాడడం, ప్రజల సమస్యలను పరిష్కరించే విషయంలో ఇప్పుడు ఆయనదీ పై చేయిగా ఉంది. అయితే ఇంకా ఏదైనా అధికార హోదా ఉన్న పదవి ఇస్తే నియో జకవర్గంలో పార్టీ కార్యకర్తలకు మరింత సహాయం చేసే అవకాశం ఉం టుందని ఆయన వర్గీయులు అభిప్రాయపడుతున్నారు. కాగా ఇంద్రక రణ్‌రెడ్డి చేరిన తరువాత ఆయన వెంట పార్టీలో చేరిన వారి ప్రభావం నియోజక వర్గంలో అంతంతగానే ఉందన్న అభి ప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా డీసీసీ అధ్యక్షులు శ్రీహ రిరావు అధికార హోదా ఉండే నామినేటెడ్ పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు కూడా తెలు స్తోంది. పార్టీకి చెందిన సీనియర్ నేతలతో ఆయన ప్రయత్నాలు చేస్తు న్నట్లు సమాచారం. ఇక మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన తరువాత నియోజకవర్గంలో పరామర్శల వంటి పర్యటనలు తప్ప డీసీసీ అధ్యక్షునితో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. ఎక్కువ కాలం హైదరాబాద్‌కు పరిమితమవుతున్నారన్న చర్చ పార్టీ వర్గాల్లో ఉన్నది.

### ముథోల్‌లో వర్గపోరు

ముథోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీగా నారాయణరావు పటేల్ వ్యవహరిస్తున్నారు. అయితే ఆయనకు వ్యతిరే కంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి నియోజకవర్గం లో సొంత కుంపటి పెట్టి రాజకీయాలు చేస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకే పని విషయంలో అధికారులపై వీరిద్దరూ వే రువేరుగా ఒత్తిడి పెంచుతున్నారన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవు తున్నాయి. కొద్ది రోజులుగా విఠల్‌రెడ్డి నియోజకవర్గంలో పర్యటనలు పెంచిన నేపథ్యంలో.. దీన్ని నారాయణరావు పటేల్ వర్గం తీవ్రంగా తీ సుకుంటోంది. నియోజకవర్గ ఇన్‌చార్జీగా ఏదైనా తన కనుసన్నల్లో నడ వాలని పటేల్ వర్గీయులు అధిష్ఠానం దృష్టికి తీసుకువెళుతున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కకు కూడా పటేల్ వర్గీయు లు ఫిర్యాదులు చేసినట్లు కూడా సమాచారం.

## ప్రత్యేక కేటగిరీ విద్యార్థులకు ఎంపిక ప్రక్రియ



ట్రిపుల్ ఐటీలో విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

బాసర, జూలై 4 : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీకి మిగిలిపోయిన 96 ప్రత్యేక కేటగిరీ సీట్ల కోసం అడ్మిషన్ ప్రక్రియను అధికారులు గురువారం ప్రా రంభించారు. క్యాప్, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ దివ్యాంగులకు ప్రత్యేక కెటగిరీ కింద 96 సీట్లు ఉంటాయి. వీళ్లకు ధ్రువీకరణ పత్రాలు, పదవ తరగతి జీపీఏతో పాటు వారికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను స్వయంగా పరిశీలించి అర్హులైన వారికి ప్రవేశం కల్పిస్తారు. ఇందులో భాగంగా గురువారం, శుక్రవారం రెండు రోజుల పాటు అధికారులు ఈ ప్రక్రియ చేపడుతున్నారు. మొదటిరోజు వచ్చిన విద్యార్థులకు డాక్టర్లు, క్రీడా, ఎన్‌సీసీ నిపుణులు సంబంధిత ధృవీకరణ పత్రా లను పరిశీలించి ఎంపిక చేశారు.

## విద్యాసంస్థల బంద్ ప్రశాంతం

- నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలని డిమాండ్




జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

నిర్మల్ కల్చరల్, జూలై 4 : జిల్లాకేంద్రంలో గురువారం వామపక్షాలు నిర్వ హించిన విద్యాసంస్థలు బంద్ పాటించాయి. జూనియర్ కళాశాల విద్యార్థులు తరగతులు బహిష్కరించి నిరసన తెలిపారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మహేందర్ మాట్లాడుతూ.. నీట్ పరీక్షలో నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని అన్నారు. నీట్ పరీక్ష నిర్వహణలో కేంద్రం స్పందించకపోవడం విద్యా ర్థుల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. దేశంలోని 24 లక్షల మంది భవిష్యత్ అంధకారంగా మారిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలని, ఎన్టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ పదవికి రాజీనామా చేయాలని కోరారు. నీట్ సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తా మని ప్రకటించారు. ఎస్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఎంబడి రాకేష్, పీడీఎస్‌యూ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్, ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి సిహెచ్. దిగంబర్, తది తరులు పాల్గొన్నారు.

**భైంసా** : నీట్‌పరీక్ష లీకేజీకి నిరసనగా పలు విద్యార్థి సంఘాలు గురువారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ భైంసాలో విజయవంతం అయ్యింది. ఈ సం దర్భాన్ని పురస్కరించుకొని ప్రైవేట్ విద్యాసంస్థలు ముందస్తుగానే తమ తమ విద్యా సంస్థలను గురువారం మూసి ఉంచారు. ఇక ప్రభుత్వ పాఠశాలలు, క ళాశాలలు కొనసాగుతుండగా విద్యార్థి సంఘాల ప్రతినిధులు అక్కడికి వెళ్లి త రగతులను బహిష్కరింపచేశారు. బంద్‌లో భాగంగా నిర్వహించిన సమావేశా ల్లో విద్యార్థి సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబి స్తున్న లోపాయికారి విధానాల మూలంగానే నీట్ ప్రశ్నపత్రం లీకేజీ జరిగిందని ఆరోపించారు. ఫలితంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు చిక్కుల్లో ప డిందని ఆందోళన వ్యక్తం చేశారు. మరోమారు ఇలాంటి లీకేజీలు చోటు చేసు కోకుండా ఉండేందుకు గాను తక్షణమే ఎన్టీఏను రద్దు చేసి పూర్తి స్థాయి ప్రక్షా ళన చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆయకట్టు పంట భూములన్నింటికీ

## సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



ప్రాజెక్టును పరిశీలిస్తున్న బీజేఎల్పీ నేత ఏలేటి

సారంగాపూర్, జూలై 4 : స్వర్ణప్రాజెక్టు ఆయకట్టు పంట భూములన్నింటికీ సాగు నీరు అందేలా కృషి చేయాలని ప్రాజెక్టు అధికారులతో బీజేఎల్పీ నేత ఏలేటి మహే శ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలో గల స్వర్ణప్రాజెక్టును ఆయన పరిశీలించి ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు సంబంధించిన కాలువలకు చేపట్టిన మరమ్మతు పనులను వేగవంతంగా చేయాలని, ప్రాజెక్టు చివరి ఆయకట్టు సాగు భూములకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈయన వెంట ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మీకాంతం, ఎంపీవో తిరుపతి రెడ్డిలతో పాటు నాయకులు, రైతులు ఉన్నారు.

## సంపూర్ణత అభియాన్‌కు ఏర్పాట్లు పూర్తి చేయండి

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నిర్మల్ కల్చరల్, జూలై 4 : నీతి ఆయోగ్ ఆస్పిరేషన్ బ్లాక్ సంపూర్ణత అభియాన్ కార్యక్రమం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో ఈ నెల 6న పెంబి మండల కేంద్రంలో నిర్వహించనున్న కార్యక్రమంపై అధికారులతో మాట్లాడారు. పెంబి మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ సభలు ని ర్వహించి అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. రాబోయే మూడు నెలల కార్యాచరణ లక్ష్యాలు, అభివృద్ధి పనులను గ్రామసభలలో ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రారంభ సమావేశంలో పాఠశాల విద్యార్థులు, స్వయం సహాయక సంఘాలు, అంగన్‌వాడీ, ఆశా, ఏఎన్ఎం, స్థానిక ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలన్నారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించాలని, సభావేదిక వద్ద విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. విద్యా ర్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయాల న్నారు. గతంలో చేపట్టిన అభివృద్ధి పనుల ఫోటో ప్రదర్శన ఏర్పాటుకు ఆదేశించారు. డీఆర్డీవో విజయలక్ష్మి, డీఈవో రవీందర్‌రెడ్డి, డీడబ్ల్యూవో నాగమణి, డీపీవో శ్రీనివాస్, జడ్పీ సీఈవో గోవింద్, వైద్యాధికారి ధనరాజ్, వ్యవసాయాధికారి అంజిప్రసాద్, మండల స్థాయి అధికారులు హాజరయ్యారు.

### బాసర ట్రిపుల్ ఐటీకి మస్కాపూర్ విద్యార్థుల ఎంపిక

ఖానాపూర్, జూలై 4 : మండలంలోని మస్కాపూర్ గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి బాసర ట్రిపుల్ ఐటీకి ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్‌రావు తెలిపారు. గురువారం బా సర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన గుమ్మల గ్రీష్మ సాయి, పసుపుల సాహితి, గుర్నాథకం అభిజ్ఞ, కొండాలపు భరద్వాజ, జక్కుల గౌతమ్, మగ్గిడి సిద్ధార్థ, బాస వశిష్ఠలను పాఠ శాల ఆవరణలో ఉపాధ్యాయుల బృందం ఘనంగా అభినందించింది. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు నరేందర్‌రెడ్డి, టి. శంకర్, కుర్రశేఖర్, జాడి శ్రీనివాస్, వెన్నం అంజయ్య, శోభారాణి, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

## వన మహోత్సవ కార్యక్రమానికి పటిష్ఠ చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశానికి హాజరైన అధికారులు

నిర్మల్ టౌన్, జూలై 4 : వన మహోత్సవ కార్యక్రమానికి పటిష్ఠచర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వన మహోత్సవ కార్యక్రమ అమలు, శాఖల వారీగా లక్ష్యం తదితర అంశాలపై అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో వన మహోత్సవ కార్యక్రమానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. జియో ట్యాగింగ్, నాటిన మొక్కల వివరాలను రోజు వారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీ నర్సరీల్లో అందుబా టులో ఉన్న మొక్కల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పూలు, పండ్లు, ఔషధ మొక్కలు అందుబాటులో ఉంచాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో అవసరమైన మొక్కలను పంపిణీకి సిద్ధంగా ఉంచాలన్నారు. శాఖల వారీగా గ్రామ, మండ ల, పట్టణ ప్రభుత్వ కార్యాలయాలలోని ఖాళీ ప్రదేశాల్లో విరివిగా మొక్కలు నాటాలని ఆదేశించారు. శాఖల వారీగా మొక్కల సంఖ్య, అందుబాటులో ఉన్న ఖాళీ ప్రదేశాల వివరాలను సమర్పించాలని సూచించారు. పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేయాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, స్మశాన వాటికలు, పోలీస్ స్టేషన్లు, అటవీ శాఖ, ఇతర కార్యాలయాల్లో ఖాళీ ప్రదేశాలలో విరివిగా మొక్కలు నాటాలని ఆదేశించారు. వన మహోత్సవ కార్యక్రమ విజయవంతా నికి ప్రజలు, విద్యార్థులు, యువతను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అటవీ శాఖ అధికారులు ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, ప్రసాద్, డీఆర్డీవో విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రాజు, డీపీవో శ్రీనివాస్, జడ్పీ సీఈవో గోవింద్, డీఈవో రవీందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

## దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి మరువలేనిది

- అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్



కొమురయ్యకు నివాళులర్పిస్తున్న అధికారులు

నిర్మల్ కల్చరల్, జూలై 4 : దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి మరువ లేనిదని అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ కొనియాడారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కొమురయ్య 78వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆయన కీలక భూమిక పోషించారన్నారు. అలాంటి గొప్ప త్యాగధనులను స్మరించు కోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వాలు మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలు అధికారికంగా నిర్వహించడం అభినందనీ యమని తెలిపారు. భవిష్యత్ తరాలు వారి చరిత్ర తెలుసుకుంటాయన్నారు. బీసీ సంక్షేమ అధికారి రాజేశ్వర్‌గౌడ్, సహాయ అధికారి గంగాధర్, డీఆర్డీవో విజయలక్ష్మి, వైద్యాధికారి ధనరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## అందరి భాగస్వామ్యంతోనే అభివృద్ధి

- జిల్లా పరిషత్ చైర్మన్ కొరిపెల్లి విజయలక్ష్మి రాంకిషన్ రెడ్డి



వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ కొరిపెల్లి విజయలక్ష్మి

నిర్మల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : అధికారులు, ప్రజా ప్రతినిధులు అందరి భాగస్వామ్యంతోనే నిర్మల్ జిల్లా అభివృద్ధి చెందిందని జిల్లా పరిషత్ చైర్మన్ కొరిపెల్లి విజయలక్ష్మి రాంకిషన్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జడ్పీ పాలకవర్గం వీడ్కోలు సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో తమకు ప్రజాసేవ చేసుకునే అదృష్టం దక్కడం ఎన్నటికీ మరువలేనిదన్నారు. తన పదవీ కాలంలో తనకు సహకరించిన అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. పదవిలో ఉన్నా లేకున్నా తాను నిరంతరం ప్రజల్లోనే ఉంటానన్నారు.

## సంక్షిప్త సమాచారం


### తాటిగూడలో రైతు మృతి



అనిల్ (ఫైల్)

పెంబి రూరల్, జూలై 4 : గుండెపోటుతో రైతు మృతి చెందిన సంఘటన మండలం లోని తాటిగూడ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... తాటిగూడ గ్రామానికి చెందిన గుగ్లావత్ అనిల్(35) తన పొలం 2 ఎకరాలలో పత్తి పంట సాగు చేస్తు న్నాడు. గురువారం ఉదయం పత్తి పంట పరిశీలించ డానికి వెళ్లాడు. ఆకస్మికంగా పడి ఉండడంతో గ్రామ స్థులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందిం చారు. అక్కడి వెళ్లే సరికి గుండెపోటుతో మృతి చెంది నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య ప్రణీత, కొడుకు, కూతురు ఉన్నారు.

### ఉరి వేసుకొని ఒకరి మృతి



రాజు మృతదేహం

సారంగాపూర్, జూలై 4 : మండలంలోని చించోలి(బి) గ్రామానికి చెందిన కొత్తపాటి రాజు(38) అనే వ్యక్తి ఉరి వేసుకొని మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పో లీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజు ప్రతీరోజు మద్యం సేవిస్తూ కుటుంబ సభ్యులతో గొడవ పడుతూ మద్యం మత్తులో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ప్రధాన మురికి కాలువలు, నాలాలు శుభ్రం చేస్తున్నాం : చైర్మన్ ఈశ్వర్



మురికి కాలువలను పరిశీలిస్తున్న ఈశ్వర్

నిర్మల్ కల్చరల్, జూలై 4 : వర్షాకాలం దృష్ట్యా నిర్మల్‌లోని ప్రధాన మురికి కాలువలను, నాలాలు, కల్వర్టులను శుభ్రం చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. గురువారం ఆయన అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు గత నెల రోజులుగా సమన్వయంతో పని చేస్తున్నారన్నారు. గతంలో వర్షాలకు ముంపుకు గురైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. మున్సిపల్ రంగా జోళినాలా, ప్రధాన మురికి కాలువలు, కల్వర్టుల శుభ్ర త చేపట్టామని పేర్కొన్నారు. నాళాలపై అక్రమ నిర్మా ణాలు తొలగించి వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్య లు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు ఇబ్బందులు పడ కుండా యుద్ధప్రాతిపదికన అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. కమిషనర్ రాజు, ఇరిగేషన్ అధికారులతో కలిసి తిరుమల థియేటర్, శి వాజీచౌక్, శాస్త్రీనగర్ ప్రాంతాలు సందర్శించారు. నాళా లపై ఉన్న అక్రమ నిర్మాణాలు తొలగించారు. జీఎన్ ఆర్, వైఎస్ఆర్ కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. డీఈ సంతోష్ జాదవ్, టీపీవో సుమలత, టీపీఎస్ నవీన్, ఏఈ, కౌన్సిలర్లు ఉన్నారు.